



నారాయణపూర్ డెలివరీ సిస్టర్న్ నుంచి విడుదలవుతున్న నీరు

'ఎల్లంపల్లి' నీరు విడుదల

గంగాధర, మార్చి 10: ఎల్లంపల్లి నీటిని అధికారులు విడుదల చేశారు. ఆదివారం మేడారంలో ఒక్క పంపును అధికారులు నడిపించగా నారాయణపూర్ రిజర్వా యర్‌కు నీరు చేరింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉండగా నీటి విడుదలను గత నెల 20న నిలిపివేశారు. పంపులు నిలిపివే యడంతో సాగు నీటి కోసం రైతులు ఆందోళన చెందారు. ప్రస్తుతం నారా యణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లం పల్లి నీరు చేరడంతో పొలాలకు జీవం పోసినట్టయింది. ఈ సందర్భంగా ఎల్లం పల్లి నీరు విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

● పంటలను కాపాడుతాం

నియోజకవర్గంలోని పంటలకు సాగునీరందించి కాపాడుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులతో మాట్లాడి ఎల్లంపల్లి నీరు విడు దల చేయించినట్లు ఆయన తెలిపారు. ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాన్ని నమ్మి రైతులు ఆందోళన చెందవద్దన్నారు.



చిగురుమామిడి ఉల్లంపల్లిలో ఎండిపోయిన పొలంలో పశువులను మేపుతున్న రైతు

ఆశలు ఆవిరి

మార్చిలోనే ఎండలు మండుతున్నాయి. భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. మెట్టప్రాంతాల్లోని పంటలు ఎండిపోతున్నాయి. వేల రూపా యల పెట్టుబడి పెట్టిన రైతులు పంటలను కాపాడేందుకు తిప్పలు పడుతున్నారు. బావుల్లో పూడిక తీయిస్తున్నా ఫలితం ఉండకపో వడంతో పొలాలు, చేలల్లో పశువులను మేపుతున్నారు.

● సాగునీరు లేక ఎండుతున్న పంటలు
● రోజురోజుకు అడుగంటుతున్న భూగర్భ జలాలు
● పొలాల్లో పశువులను మేపుతున్న రైతులు

సైదాపూర్, మార్చి 10: మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాలైన అమ్మనగుర్తి, బొమ్మకల్, నల్లానిరామయ్యపల్లి, గొడిశాల, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, రాయికల్, జాగీర్‌పల్లి, రాంచంద్రాపూర్, చింతలపల్లి, ఎలబోతారం, రాములపల్లి, సర్వాయిపేట, ఆరెపల్లి గ్రామాల్లో పంట లు ఎండుతున్నాయి. వేల రూపాయల పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడ్డ రైతులు పంటలు కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వరి, మొక్కజొన్న పంటలతో పాటు ఆరుతడి పంటలు కూడా ఎండి పోతున్నాయి. మెట్ట ప్రాంతాలకు కాలువ లేక పోవడంతో బావుల్లో నీరు తొందరగానే ఇంకిపోయాయి. రైతులు క్రేన్ల సహాయంతో బావుల పూడిక తీస్తున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చిగురుమామిడి: ఎండల తీవ్రత పెరుగడంతో మండ లంలోని అన్ని గ్రామాల్లో వరి పొలాలు ఎండి పోతున్నాయి. సాగు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలను కాపా డుకునేందుకు రైతులు బోర్లు వేయిస్తున్నారు. భారీగా ఖర్చు పెట్టి వేసిన బోర్లలోనూ నీరు రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 125 బోర్లు వేసినట్లు సమాచారం. ఈ బోర్లలో నీరు రాలేదు. దీంతో రైతులు మరింత అప్పుల్లో కూరుకుపోయారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టు పూర్తి చేసి గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపితే ఇబ్బంది ఉండేదికాదు.ఎండిన పంటలపై అధికారులు సర్వేలు చేసి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..
- తల్లపెల్లి చంద్రయ్య, సుందరగిరి, చిగురుమామిడి

మండలం మెట్టప్రాంతం కావడంతో సాగు నీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి.

నష్టపరిహారం అందించాలి..
- పైడిపల్లి మల్లేశం, కొండాపూర్, చిగురమామిడి

ఎండలు ముదరడంతో బావులు అడుగంటాయి. చేతికి అందే దశలో ఉన్న వరి పంట పూర్తిగా ఎండిపోయింది. ఎండిపోయిన పంటలను అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అందించాలి.

ఎండిన చేలల్లో పశువులను మేపుతున్నాం
- ములుగు తిరుపతి, రైతు, అమ్మనగుర్తి, సైదాపూర్



నేను నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న, ఎకరంలో వేరుశనగ సాగు చేశాను. అప్పుడు నీళ్లు ఉన్నాయి. ఎండలు ముదరడంతో నీళ్ల తగ్గాయి.రెండు ఎకరాల వరకు మొక్కజొన్న పంట ఎండి పోయింది. చేసేది లేక పశువులను మేపుతున్నాం. మరింత ఎండే అవకాశం ఉంది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం మెట్ట ప్రాంత రైతులను ఆదుకోవాలి.



సైదాపూర్ మండలం జాగీర్‌పల్లిలో క్రేన్ సహాయంతో పూడిక తీస్తున్న రైతులు



సైదాపూర్ మండలం అమ్మనగుర్తిలో ఎండిన మొక్కజొన్న పంటలో పశువులను మేపుతున్న రైతు



చిగురుమామిడి బొమ్మనపల్లిలో నీళ్లు లేక వరి పొలానికి ట్యాంకర్‌తో నీళ్లు అందిస్తున్న రైతు

నేడు జేఎల్‌ఎం పోస్టుల నియామక పరీక్షలు

గణేష్‌నగర్, మార్చి 10: టీఎస్ ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్‌లో జూనియర్ లైన్‌మెన్ పోస్టుల నియామక పరీక్షలను సోమవారం నిర్వహిస్తామని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో అన్నారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులకు కాల్ లెటర్లను వారి చిరునామాకు పంపించడం జరిగిందన్నారు. నియామకాలను పారదర్శకంగా నిర్వహిస్తామని, అభ్యర్థులు ఎవరి మాటలు నమ్మవద్దన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ద్వితీయ స్థానం

కరీంనగర్‌స్పోర్ట్స్, మార్చి 10: రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధిం చింది. వరంగల్ జిల్లా పైడిపల్లి ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు ఫైనల్స్‌లో వరంగల్ జిల్లా జట్టుతో తలపడింది. జట్టుకు కోచ్‌గా మూర వెంక టేశ్ వ్యవహరించారు. ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టును హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు,లక్ష్మణ్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ అసోసి యేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఉపా ధ్యక్షుడు కాసర్ల ఆనంద్‌కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, బాధ్యులు సురేందర్, జి హరికృష్ణ అభినందించారు.

న్యాక్‌లో మూడు నెలల ఉచిత శిక్షణ

హుజూరాబాద్, మార్చి 10: హుజూరాబాద్ కేసీ క్యాంపులోని పాత డిగ్రీ కళాశాలలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వ ర్యంలో నిర్మాణ రంగ కార్మికుల పిల్లలకు శిక్షణ ఇస్తున్నట్లు సెం టర్ ఇన్‌చార్జి ఎడ్ల ఆదాం ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ నెల 15వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవు తుందన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వారికి ఎలక్ట్రికల్, ల్యాండ్ సర్వేయర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ప్రైవేట్ కంపెనీల్లోఉపాధి కల్పిస్తామని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు 7396988875, 8639083214 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

● కలెక్టర్ పమేలా సత్పతి



5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా అధికారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 10: వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మానేరు డ్యాం కట్టపై ఆదివారం 5కే రన్నింగ్, జాగింగ్, వాకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండాలంటే ప్రతిరోజు వ్యాయాయం చేయాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పద్మావతి మాట్లాడుతూ గతంలో నిర్వహించిన మారథాన్ కార్యక్రమం విజయవంతం అవడంతో మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలనే ఉద్దేశ్యంతో కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్స్ అసోసియేషన్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని అన్నారు. పోటీల నిర్వాహకుడు, అసోసియేషన్ అధ్యక్షుడు పసుల మహేశ్ మాట్లాడుతూ మహిళలు తమ దిన చర్యలో సైక్లింగ్, రన్నింగ్, వాకింగ్ లాంటి వాటిని భాగంగా చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌తో సహా మహిళలు, అసోసి యేషన్ సభ్యులు అధికారులు ఐదు కిలోమీటర్ల వాకింగ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విమల, హేమభట్, స్వప్న, గాయత్రి, గీతిక, కావ్య, ఉషాఖండల్, రవీందర్, శివ, రోహిత్, సంతోష్, శేఖర్, కిరణ్, అజయ్‌ఖండల్, డిప్యూటీ మున్సిపల్ కమిషనరల్ స్వరూప, అఖిల్, పర్శరామ్, గులాబ్‌సింగ్ చౌహాన్, శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.

సంఘం సంఘటితమైనప్పుడే గౌరవం

● గౌడ కులస్తుల అభివృద్ధికి కృషి
● మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘాల ప్రతినిధులు

భగత్‌నగర్, మార్చి 10: సంఘం సంఘటితమైనప్పుడే ప్రతి వ్యక్తికి గౌరవం దక్కుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం నగరం బైపాస్‌రోడ్‌లోని వి కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా గౌడ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గౌడ కులస్థులకు అండగా ఉంటా మన్నారు. గౌడ కులస్థులు ఆర్థికంగాఎదిగేందుకు కృషి చేస్తామన్నారు. కల్లును కల్తీ చేయకుండా చౌకగా అందరికీ అందుబాటులో ఉంచా లన్నారు. ఎంత ఎదిగినా ప్రతి వ్యక్తికి సంఘం మద్దతు ఉండాలన్నారు. బలహీనవర్గాల బిడ్డగాఅందరికి అందు బాటులో ఉంటానన్నారు. సమస్యలు ఏవైనా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ ఎండి బూరుగు సత్యనారాయణగౌడ్, మాజీ మంత్రి రాజేశం గౌడ్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పల్లె లక్ష్మణ్‌గౌడ్, రాచకొండ తిరుపతిగౌడ్, రిటైర్డ్ డీసీపీ సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, పొన్నం సత్యంగౌడ్, సుదగోని లక్ష్మీనారాయణ, పులి అంజనేయులుగౌడ్, పొన్నం శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్, మాచర్ల అంజయ్య, ప్రసాద్, కోట రవి, దేశిని కోటి పాల్గొన్నారు.

● టెస్కాబ్ ద్వారా చేనేత వస్త్రాల కొనుగోలు

సుభాష్‌నగర్: చేనేత వస్త్రాలను టెస్కాబ్ ద్వారా కొనుగోలు చేస్తా మని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ఆయన ముఖ్య అతి తిగా హాజరయ్యారు. చేనేత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు చేనేత వస్త్రాలను అందిస్తామన్నారు.ఈ సందర్భంగా పలు వురు మహిళలను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో చేనేత ఐక్య వేదిక కార్యనిర్వాహక అధికారి కోటిపల్లి సదానందం, కోశాధికారి చిలువేరు గణేశ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జడల చిరంజీవి, భాస్కర్, రావిరాల శ్రీనివాస్, వెంక టేశ్వర్లు, మంచికట్ల కోటేశ్వర్, గుడా లావణ్య, చిందం సునీత, పోచం సునీత, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, అందెజ్యోతి, కృష్ణవేణి, బుర్ర మల్లేశం, స్వర్గం మల్లేశం పాల్గొన్నారు.

కదనభేరి సభకు కదలిరావాలి



సమావేశంలో మాజీ మంత్రి గంగులకమలాకర్

కరీంనగర్ టౌన్, మార్చి 10: నగరంలో ఈ నెల 12న నిర్వహించనున్న కదనభేరి సభకు కదలి రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నగరంలోని కార్పోరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో కదనభేరి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతున్న సమావేశంలో ప్రతి డివిజన్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్

సుభాష్‌నగర్, మార్చి 10: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. కరీంనగర్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల సంస్కరణల పేరుతో 29 కార్మిక చట్టాలను నాలుగుకు కుదించిందన్నారు. దీంతో కార్మికుల హక్కులకు విఘాతం కలిగిందన్నారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎంఆర్ఏఐ) అధ్యక్షుడు రమేశ్‌సుందర్ మాట్లాడుతూ సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్‌ను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ సమస్యలను పరిష్కరించాల న్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో ఉన్న కార్మిక వర్గం సమైక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా చీకోటి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ భానుకిరణ్, ఉపాధ్యక్షుడిగా ఐ రాజుభట్, సహాయ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, కోశాధికారిగా దుర్గాప్రసాద్, కార్యదర్శులుగా కె ఐలయ్య, జి విద్యాసాగర్, ఎ సదానందచారి, సయ్యద్ సిద్దిక్, కమిటీ సభ్యులుగా గుండ శ్రీనివాస్, ఎ నరసింహచారి, కె జగదీశ్వరాచారి, ఎల్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంఎ అఫ్రోజ్, పి రాజేశ్‌కుమార్, బి మల్లికార్జున్, వి శ్రీనివాస్, ఎం సతీష్‌కుమార్, పి రాము, కె సుధాకర్, సోమ స్వామిని ఎన్నుకున్నారు.



ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, మార్చి 10: మానేరు పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు. ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కనగర్తి గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



విద్యుదాఘాతంతో రైతు మృతి

- మరో ముగ్గురికి అస్వస్థత
- బోరు మోటారు దించే క్రమంలో ఘటన

కోనరావుపేట, మార్చి 10: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట మండలం బావుసాయిపేటలో ఆదివారం విద్యుదాఘాతంతో పంబాల భూమయ్య (35) అనే రైతు మృతి చెందాడు. మరో ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం బావుసాయిపేటలోని తిక్కల భూమయ్యకు చెందిన వ్యవసాయ భూమి వద్ద బోరు బావిలో మోటారు దించడానికి రైతులను తీసుకెళ్లాడు. మోటారు దించుతున్న క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు బోరు బావి పైపునకు తగలడంతో నలుగురు రైతులు విద్యుదాఘాతానికి గురయ్యారు. వారిలో పంబాల భూమయ్య అనే రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. పంబాల రాజు, కర్నాల మహేష్, తుపాకుల శ్రీనివాస్ అస్వస్థతకు గురవగా అక్కడే ఉన్న మరి కొంతమంది రైతులు వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆసుపత్రికి చేరుకొని రైతు కుటుంబాలను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మృతి చెందిన పంబాల భూమయ్యకు భార్య అనిత, కుమారుడు రేశ్వంత్, కూతురు గౌతమి ఉన్నారు.


భూమయ్య(ఫైల్)

రోడ్డుపై ధర్నా.. పోలీసు విధులకు ఆటంకంపై కేసు

కరీంనగర్ క్రైం, మార్చి10: కరీంనగర్‌లోని రాంనగర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి స్థానికులు కొందరు ధర్నాకు దిగారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల సందర్భంలో ట్రాఫిక్ పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. రెండో టౌన్ సీఐ రమేశ్ సంఘటనా స్థలానికి వెళ్లి ధర్నాను విరమింపజేశారు. ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన కొందరు తమ వాహనాలను ఇవ్వాలని పోలీసులతో వాగ్వాదం చేస్తూ విధులకు ఆటంకం కలిగించారని రెండో టౌన్ సీఐ రమేశ్ తెలిపారు. పోలీసుల విధులను ఆటంకపరిచినందుకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. పట్టుకున్న వాహనాలను టౌన్‌కు తరలించినట్లు తెలిపారు.

గోపాల్‌రావుపేటలో చోరీ

రామడుగు, మార్చి 10: మండలంలోని గోపాల్‌రావుపేటలోని ఓ ఫొటో అండ్ వీడియో షాపులో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గోపాల్‌రావుపేట బస్టాండ్ వద్ద మధు అనే యువకుడు ఫొటో స్టూడియోతో పాటు గడియారాల షాపును నిర్వహిస్తున్నాడు. షాపు యజమాని ఆదివారం ఉదయం షాపును తీసేందుకు వెళ్లగా వెనుక తలుపు తీసి ఉండడాన్ని గమనించాడు. దుకాణంలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో కౌంటర్‌లో చూడగా రూ. 10,500 కనబడలేదు. దీంతో పాటు దుకాణంలో ఉన్న 20 గడియారాలు చోరీకి గురి అయినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై సురేందర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని నాలుగైదు దుకాణాల షాపుల తాళాలను పగుకొట్టేందుకు ప్రయత్నించగా అవి రాకపోవడంతో వెళ్లిపోయినట్లు ఆయా దుకాణాల యజమానులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కరీంనగర్ క్రైం, మార్చి 10: కరీంనగర్‌లోని పాతబజారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతబజారుకు చెందిన శివరవీందర్(64), ఆయన తల్లి శివసువర్ణ(85)లకు తీవ్ర గాయాలయ్యాయని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. రాఘవేంద్రనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై పాతబజారుకు వెళ్తుండగా ఒక ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టిందని తెలిపారు. గాయపడిన ఇద్దరిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని పోలీసులు తెలిపారు.


చదరంగ పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 10: జీనియస్ చెస్ అకాడమి, తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జీనియస్ చెస్ అకాడమిలో నిర్వహించిన మహిళల ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ పోటీలకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 65 మంది పాల్గొని ప్రతిభ చాటారు. ప్రైమ్ కిడ్నీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ చాందిని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమి వ్యవస్థాపకుడు కనకయ్య, డాక్టర్ కృష్ణ చైతన్య, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్తాక అధ్యక్షుడు నాగరాజు, సైకియాట్రిస్ట్ అనిత తదితరులు పాల్గొన్నారు.











రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలి


సీఎంను కోరిన డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్లు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలను బలోపేతం చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ల సభ్యులు కోరారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్.ఆర్ సరిత, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, అసోసియేట్ ప్రెసిడెంట్ పూల్‌సింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల పెండింగ్ సమస్యలు, తహసీల్దార్ల అద్దె వాహనాలకు బిల్లుల చెల్లింపు, క్యాడర్ బలోపేతం, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత రెవెన్యూ డివిజన్లు, మండలాలు పెరిగినా.. రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య పెరగలేదని చెప్పారు. దీంతో ఉన్న ఉద్యోగుల మీదనే పని భారం పడుతోందని, జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగా క్యాడర్‌ను పెంచాలని సీఎంను కోరారు. ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జీఏడీ పరిధిలోని అదనపు కలెక్టర్ల పోస్టుల వ్యవహారాన్ని రెవెన్యూ విభాగ పరిధిలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు అసోసియేషన్ల ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు పూజల్లో పాల్గొననున్న సీఎం
- పట్టు వస్త్రాలు, తలంబ్రాల సమర్పణ

యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10గంటలకు ప్రధానాలయ ముఖ మండపంలో అర్చక, వేదపండితుల బృందం సంప్రదాయరీతిలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు వైదిక పూజల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఆయన సోమవారం ఉదయం 9గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కొండపైకి చేరుకుని వీవీఐపీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. 9.30గంటలకు ప్రధానాలయంలో స్వయంభువులను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్లకు


లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విద్యుద్దీపాల వెలుగులు

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవస్థాన అధికారులకు అందజేస్తారు. ఉదయం 11గంటలకు రేవంత్ హెలికాప్టర్‌లో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి బయల్దేరివెళతారు. సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో కొండ కింద పాత గోశాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ వద్ద పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం పరిశీలించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు పూజల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఈసారి రూ.1.60కోట్లు కేటాయించామని, అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18న జరిగే తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనే విధంగా 600 టికెట్లను విక్రయిస్తామని, ఒక్కో టికెట్ ధర రూ.3వేలని తెలిపారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న రాత్రి ఎదుర్కోలు, 18న రాత్రి తిరుకల్యాణోత్సవం, 19న రాత్రి దివ్య విమాన రథోత్సవ ఘట్టాలను నిర్వహిస్తారు. ఈ నెల 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం ఉంటుంది. 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

లోకం తీరు



ఉద్యోగులకు ఏడో గ్యారెంటీ!

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ని రోజులూ ఆయా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నది కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్బంధాలతో పాలన సాగిస్తామనుకోవడం వారి భ్రమ అని, సమస్యలకు చర్చలే పరిష్కారం తప్ప.. నిర్బంధాలు కావని అన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు విశ్వాసం కల్పించడానికే చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం శాఖలవారీగా సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటుందని, సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, వివిధ శాఖల్లో ఉన్న 1100 మంది రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచితంగా విద్యుత్తు ఇచ్చే విషయంలోనూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తారీకునే జీతాలు వేసినా తాము ప్రచారం చేసుకోవడం లేదన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు.

తెలంగాణ బాపు కేసీఆర్ కాదు..

మాజీ సీఎం కేసీఆర్ తనకు తాను తెలంగాణ బాపుగా చెప్పుకొంటున్నారని, అలా చెప్పుకోవడానికి కనీస పోలిక ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బాపు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, తెలంగాణ ఆత్మను గౌరవించకపోతే సమాజం



మనల్ని క్షమించదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆదాయం పడిపోతే.. మద్యంపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడేలా కేసీఆర్ పాలన సాగిందని విమర్శించారు. విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని రేవంత్ అన్నారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి రక్తమూ చిందలేదని, కానీ.. కానిస్టేబుల్ కిష్టయ్య లాంటివారు రక్తాన్ని చిందించారని, శ్రీకాంతాచారి లాంటివారు మాంసపు ముద్దలయ్యారని అన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసనమండలికి తప్పక పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఎమ్మెల్సీగా ఉంటే శాసనమండలికి గౌరవమన్నారు. ఈ విషయంపై గవర్నర్ తమిళిసైతో మాట్లాడతానన్నారు. ఈ సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, కోదండరామ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లు, ఉద్యోగులలో సంతోషం..

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం కావడం పట్ల ఆయా సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఏర్పాటైన ఈ సమావేశంలో.. ప్రధాన డిమాండ్లను సీఎం దృష్టికి టీజీవోఏ తీసుకెళ్లింది. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో మూడింటిని ఇవ్వాలని, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరింది. వీటితోపాటు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని విన్నవించింది. కాగా, ముఖ్యమంత్రి రెండు గంటలపాటు తమ సమస్యలపై మాట్లాడమే కాకుండా ఎంతో ఓపికగా విన్నారని సంఘాల నేతలు తెలిపారు. గతంలో కనీసం సమస్యలు వినే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. కాగా, వైద్యశాఖలో పని చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ అందరినీ బదిలీ చేయాలని మెడికల్ జేఏసీ.. ముఖ్యమంత్రిని కోరింది. ఉస్మానియాకు కొత్త భవనం కట్టాలని, అశాస్త్రీయంగా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను తగ్గించాలని సూచించింది. ఆస్పత్రుల్లో విధులకు వచ్చే నర్సులు దుస్తులు మార్చుకునేందుకు కనీసం రూమ్‌లు లేని విషయాన్ని నర్సుల అసోసియేషన్ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఇక సాధారణ బదిలీలు, పదోన్నతులు, 317 సమస్యను పరిష్కరించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణపై ఆయా సంఘాల ప్రతినిధులు సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా టీచర్లకు సంబంధించిన మల్టీజోన్, స్పౌజ్ సమస్యలు, స్థానికత, బదిలీలు, ఆరోగ్య బీమా, పెండింగ్ డీఏ లాంటి సమస్యలను వివరించారు. కాగా వినతి పత్రాలను కొన్నింటిని సీఎం నేరుగా తీసుకున్నారు.

సీఎంకు పీఆర్‌టీయూ నేతల కృతజ్ఞతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమే కాకుండా సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం పట్ల పీఆర్‌టీయూ నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారంలోకి వచ్చిన 72 రోజులకే 31వేల ఉద్యోగాలిచ్చాం

- మరో గ్యారెంటీకి శ్రీకారం: పొంగులేటి
- మాటిస్తే కాంగ్రెస్ మడమ తిప్పదు: సురేఖ
- జీవో 3పై కవిత వ్యాఖ్య విడ్డూరం: సీతక్క

వరంగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాము అధికారంలోకి వచ్చిన 72 రోజుల్లోనే 32వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యుద్ధప్రతిపాదికన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉసురు తీసుకుందని, తాము 11,600 టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో రూ.68 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు, వరంగల్ నగరంలో రూ.280.85 కోట్లతో చేపట్టిన పనులకు మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని తెలిపారు. ఒకటో తేదీ నుంచి మూడో తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరానికి రూ.260కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. జీవో నంబరు 3కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం విడ్డూరమని, అసలు ఆ జీవో ఇచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు బంద్ చేసి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించారు.

భట్టి నాకు ద్రోహం చేస్తున్నారు

- ఖమ్మం టికెట్‌ను అడ్డుకుంటున్నారు: వీహెచ్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనకు ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం లోక్‌సభ సీటు తనకు రాకుండా భట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. 'భట్టిని అప్పట్లో ఎమ్మెల్సీని చేయడంలో నాదే కీలక పాత్ర.. భట్టి ఈరోజు పార్టీలో ఈస్థానంలో ఉండడానికి కారణం నేనే.. 2019 వరకు ఖమ్మంలో ప్రతి కార్యక్రమానికి ఆయన నన్ను రమ్మన్నారు.. ఆ తర్వాత పిలవడం మానేశారు. పనిచేసినోడికి ముఖ్యమంత్రి పదవి రావాలని నేను అన్నందుకే నాపై కక్ష కట్టారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారని చెప్పారు. 'రాహుల్‌ఖమ్మం నుంచి పోటీ చేస్తే నేను తప్పుకుంటా.. లేదంటే ఆ సీటుకు నేను అన్నివిధాల అర్హుడిని.. ఖమ్మం టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తా.. పదవి ఉన్నా లేకపోయినా చనిపోయేవరకు కాంగ్రెస్‌లోనే ఉంటా.. చనిపోయిన తర్వాత పార్టీ జెండా నాపై ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

వీహెచ్‌కు ఖమ్మం టికెటిస్తే కలిసికట్టుగా గెలిపిస్తాం

- నేను అడ్డుపడడం..ఆయన అపోహ: భట్టి

చింతకాని, మార్చి 10: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీదే తుది నిర్ణయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ కమిటీ నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన భట్టి.. ఎంపీ టికెట్ల కేటాయింపు విషయమై పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం వీహెచ్‌కు ఖమ్మం ఎంపీ టికెట్ ఇస్తే జిల్లా మంత్రులు, నాయకులు, కార్యకర్తలు.. అందరం కలసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని చెప్పారు. ఖమ్మం ఎంపీ టికెట్ వీహెచ్‌కు రాకుండా తాను అడ్డుపడటం లేదని.. అది కేవలం ఆయన అపోహ మాత్రమేనన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా వీహెచ్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో పాటు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ తక్షణ కర్తవ్యమన్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

- 317 జీవో వల్ల బాధితులుగా మారాం
- మంత్రి దామోదరను కలిసిన నర్సులు

గత సర్కారు హయాంలో విడుదల చేసిన జీవో నంబరు 317 వల్ల తాము బాధితులుగా మారామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నర్సులు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం నిరంకుశంగా జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి తమ జీవితాలతో చెలగాటం ఆడుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 317జీవోపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించి, అందరికీ న్యాయం చేస్తామని మంత్రి ఉద్యోగులకు భరోసానిచ్చారు.

పేదింటి పండుగ

నేడు 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఖమ్మం/భద్రాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. "ఇందిరమ్మ ఇల్లు" పథకం కార్యరూపం దాల్చనుంది. రాములవారు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం దీనికి వేదిక కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇల్లు ఐదోది. అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో నాలుగు పథకాలను అమలు చేసింది. కాగా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను కూడా సోమవారం ప్రకటించనున్నారు. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను సర్కారు సిద్ధం చేసింది. ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ దశలవారీగా వర్తింపజేయనున్నారు. స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు, లేనివారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని నాలుగు దశల్లో మంజూరు చేస్తారు. ఈ ఏడాదిలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లను మంజూరు చేయగా.. రిజర్వ్ కోటా (సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిధి)లో మరో 33,500 కేటాయించారు. మొత్తంగా 4.50లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయి. తొలి దశలో సొంత స్థలం ఉన్నవారికి అందనుండగా.. స్థలం లేనివారికి రెండో దశలో పథకాన్ని వర్తింపజేస్తారు. ఇంటి నిర్మాణం విషయంలో లబ్ధిదారుదే పూర్తి నిర్ణయం అయినప్పటికీ.. ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో పాటు కచ్చితంగా వంట గది, బాత్‌రూమ్ ఉండాలి. అనంతరం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద నిర్మించినదని తెలిసేలా 'అభయహస్తం' లేదా ప్రత్యేకంగా తయారు చేసే కొత్త లోగోను ఉంచనున్నారు. కాగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల విషయంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా, అర్హులకే పథకం అందేలా మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ పథకానికి అర్హులైన వారు దాదాపు 30-40 లక్షలమంది ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయ్యాక హెచ్చుతగ్గులు ఉండొచ్చని కూడా భావిస్తోంది. దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే గ్రామసభల్లోనూ మరోసారి పరిశీలించనున్నారు. గ్రామసభల్లో వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రొఫార్మాను రూపొందించింది.



పథకం కోసం రుణం..

ఇందిరమ్మ ఇల్లు పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఎన్ని ఇళ్లను ఏయే దశల్లో నిర్మిస్తామనే వివరాలను కూడా తెలిపింది. తొలి శలో గ్రామీణ ప్రాంతాల్లో 57,141, పట్టనాల్లో 38,094 ఇళ్లను నిర్మిస్తామని పేర్కొంటూ ఈ నె 5న జీవో విడుదల చేసింది. దీని ప్రకారం నియోజకవర్గానికి 800 ఇళ్లు అందనున్నట్టు తెలుస్తోంది. ఈ గణాంకాలు, అంచనాలు హడ్కో రుణం కోసం సంబంధించినవేనని సమాచారం. వీటికి మరికొన్ని కలిపి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని మహిళ పేరు మీద అందిస్తారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్మాణాలను పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుకి రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలి. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొంది ఉంటే అనర్హులు. మంజూరైన ఇళ్ల కంటే లబ్ధిదారులు ఎక్కువ ఉంటే.. వారికి మరో విడతలో అందిస్తారు.

సీఎం భద్రాచలం పర్యటన షెడ్యూల్ ఇది..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12:10 గంటలకు భద్రాచలం రాముడిని దర్శించుకోనున్నారు. 1:30కు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సభలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభిస్తారు. 2:30 నుంచి 3:30 మధ్య భద్రాచలం ఆలయం, సాగునీటి, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు మణుగూరులో సభకు హాజరవుతారు. 6:10 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు.

భద్రాచలం రామాలయం అభివృద్ధిపై ఆశ

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చిన రేవంత్.. అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో ఇప్పుడు భద్రాద్రి అభివద్ధికి వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి రూ.100కోట్లు ప్రకటించినా రూపాయీ ఇవ్వలేదు.

అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా హామీలు నెరవేరుస్తున్నాం: తుమ్మల



ఖమ్మంకార్పొరేషన్: ప్రజల సొమ్ము దోచుకోవటమే ధ్యేయంగా పనిచేసిన గత ప్రభుత్వం తమకు అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సాహసంతో ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా బూడిదెంపాడు వద్ద రూ.38.50 కోట్లతో ఖమ్మం-ఇల్లెందు రెండులైన్ల రహదారి నాలుగులైన్లుగా విస్తరణ, అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. సోమవారం భద్రాద్రి రాముడి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఐదో గ్యారెంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. శ్రీశైలం, సాగర్‌లో నీళ్ల లేకపోవడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ తప్పిదాలే కారణమన్నారు.

బడుల్లో మార్పు రావాల్సిందే!

- మౌలిక సదుపాయాలు కల్పించండి
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని.. వాటిపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కారీ బడులు, కళాశాలలకు తక్షణమే ఉచిత విద్యుత్ అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ఆదివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరిపారు. విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ బాధ్యతలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసి.. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని, బడులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని, సీఎస్‌ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాలను మెరుగుపరచేందుకు ఎన్నారైల సహకారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఐఎస్‌బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకూ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్) తీసుకువచ్చే అంశంపై సీఎం చర్చించారు. సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘ట్రినిటి’లో ఫేర్‌వెల్ వేడుకలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కరీంనగర్ టౌన్, మార్చి 10: జిల్లా కేంద్రంలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాలలో ట్రినిఫెస్ట్ పార్టీ పేరుతో ఆదివారం నిర్వహించిన ఫేర్‌వెల్‌లో విద్యార్థినిల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈకార్యక్రమానికి చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. కార్యక్రమంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

సంస్కృతాన్ని పరిరక్షించుకోవాలి



ఆచార్య జీఎస్ఆర్‌కే మూర్తికి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, మార్చి10: సంస్కృతాన్ని పరిరక్షించుకోవాలని, ఆ భాషలో అందరికీ సులువుగా అర్థమయ్యే రచనలు చేయవచ్చని విజయసారథి నిరూపించారని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. ఆదివారం యజ్ఞవరాహక్షేత్రంలో పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి 88వ జయంత్యుత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విజయసారథి 7వ రాష్ట్రీయ సంస్కృత పురస్కారాన్ని తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గుల్లపల్లి శ్రీరామ కృష్ణమూర్తి దంపతులకు సంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ దంపతులు అతిథులతో కలసి ప్రదానం చేశారు. కార్యక్రమంలో తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ సాహిత్య విభాగం బాధ్యుడు నాగరాజు, సాహితీవేత్త గంగ్ర లక్ష్మణరావు, హైదరాబాద్ సంస్కృత అకాడమీ డైరెక్టర్ నీలకంఠం పాల్గొన్నారు. సుదర్శనం వేణుశ్రీ, నలిమెల భాస్కర్, వారాల ఆనంద్, నాగేంద్రశర్మ, దాస్యం సేనాధిపతి, గిరిజామనోహర్‌బాబు, కెఎస్ అనంతాచార్య, శేషం వేణుగోపాలశర్మను సన్మానించారు.

మున్నూరుకాపులు ఐక్యంగా ముందుకు సాగాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

సుభాష్‌నగర్, మార్చి 10: మున్నూరుకాపులు ఐక్యంగా ముందుకు సాగాలని మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ట్రస్ట్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి అన్నారు. ఆదివారం నగరంలోని మున్నూరుకాపు విద్యానగర్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇప్పటికే వసతిగృహం ఉందని, త్వరలోనే ఫంక్షన్‌హాలు సైతం ఏర్పాటు చేస్తామన్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బోనాల నరసయ్య, అధ్యక్షుడు కనకం అమర్‌బాబు, ప్రధాన కార్యదర్శి అట్టెపల్లి శ్రీనివాస్, కోశాధికారి ఐల రాంమోహన్‌తో పాటు కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మున్నూరు కాపు నగర అధ్యక్షుడు నల్వాల రవీందర్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ బండారి రాజ్‌కుమార్, సాయిని నరేందర్, కార్పొరేటర్లు కొండపల్లి సతీష్, దిండిగా మహేశ్, స్తంబంకాడి గంగాధర్, ఎన్నం శ్రీనివాస్, కుదురు రవి, ఉప్పు జలపతి పాల్గొన్నారు.

బ్రిడ్జి హామీ నెరవేర్చాలి

గన్నేరువరం, మార్చి 10: గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో తాను గెలిస్తే మానేరు నదిపై బ్రిడ్జి నిర్మిస్తామన్న ఇచ్చిన హామీ నెరవేర్చకుంటే రాబోయే ఎన్నికల్లో తాము బండి సంజయ్‌పై పోటీ చేస్తామని బ్రిడ్జి సాధన జేఏసీ నాయకులు హెచ్చరించారు. మండలంలోని మైలారం మైసమ్మ గుట్టవద్ద ఆదివారం బ్రిడ్జి జేఏసీ నాయకులు నిరసన ꠸ తెలిపారు. కార్యక్రమం లో పుల్లెల జగన్, రాములు, బామండ్ల రవిందర్, మహేందర్,హరీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి అధ్యయనోత్సవాలు ప్రారంభం

తిమ్మాపూర్, మార్చి10: మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీలోగల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి పంచచత్వారింశత్ (45వ) అధ్యయనోత్సవాలు ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు ఈ నెల 18వ తేదీ వరకు కొనసా గుతాయి. సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవస్థాన నిర్వహణ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధా న కార్యదర్శి వొంటెల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

చెరువు వద్ద కుప్ప కూలి ఒకరి మృతి



నర్సయ్య(ఫైల్)

తిమ్మాపూర్, మార్చి 10: మండలంలోని పొరండ్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం చేపలు వేటకు వెళ్లిన సమయంలో ఒక్క సారిగా కుప్ప కూలి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొరండ్ల గ్రామానికి చెందిన సదిరె నర్సయ్య(63) అనే వ్యక్తి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం చేపలు పట్టేందుకు తోటి మత్స్యకారులతో కలిసి గ్రామంలోని పులిచెర కుంట వద్దకు నర్సయ్య వెళ్లాడు. ఈ క్రమంలో నర్సయ్య చేపలు పడుతుండగా ఒక్క సారిగా చెరువులోనే కుప్ప కూలాడు. అక్కడ ఉన్న వారు స్థానిక వైద్యుడి వద్ద తరలిస్తుండగా నర్సయ్య మార్గ మధ్యలోనే మృతి చెందాడు.

అలసత్వమే ఓటమికి కారణం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

శంకరపట్నం, మార్చి 10: గెలుపుపై ధీమాతో ప్రదర్శించిన అలసత్వమే తన ఓటమికి కారణమని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో కరీంనగర్ కదన భేరి సన్నాహక సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ గతం అనేది వర్తమానానికి గుణపాఠంలా పనిచేయాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12న నిర్వహించే కరీంనగర్ కదన భేరి కార్యక్రమంలో ప్రజలంతా భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పల్లె సంజీవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 10: తెలంగాణ రాష్ట్ర జట్లు జూనియర్స్ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో సత్తాచాటాలని రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. ఆదివారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో రాష్ట్ర బేస్‌బాల్ సంఘం, జిల్లా బేస్‌బాల్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 31వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాల బాలికల రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని, బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గతంలో 28వ జూనియర్స్ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలను కరీంనగర్ జిల్లా ఆతిథ్యం ఇచ్చిందని ఈసందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో బేస్‌బాల్ క్రీడకు ఆదరణ తీసుకువచ్చేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో బేస్‌బాల్ క్రీడకు కేరాఫ్ అడ్రస్‌గా కరీంనగర్ జిల్లా మారిందన్నారు. భవిష్యత్‌లో జిల్లా కేంద్రంలో మేగా జాతీయ పోటీలను నిర్వహించనున్నామని తెలియచేశారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి శ్వేత మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో క్రీడా వాతావరణం ఉట్టిపడేలా ఉందన్నారు. పంజాబ్ రాష్ట్రంలోని సంగూర్‌లో ఈనెల 22 నుంచి 25 వరకు 31వ జాతీయ స్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు సముచితస్థానం కేటాయించి నిధులు విడుదల చేయాలనికోరారు. జిల్లా బేస్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండి యూనిస్‌పాష మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు 20 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరు అయినట్లు తెలిపారు. క్రీడాకారులందరికి ఉచిత భోజన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర జట్లకు ఎంపిక చేశామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బేస్‌బాల్ సంఘం కోశాధికారి కృష్ణ, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ప్రతినిధులు గంగామోహన్, మల్లేశ్, భిట్ర శ్రీనివాస్, వీరన్న, వీర్‌పాల్‌రెడ్డి, వంగపల్లి సూర్యప్రకాశ్, సిలివేరి మహేందర్, కిష్టారెడ్డి, శానవాజ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 10: నగరంలోని అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరంలో ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలను మఠాధిపతి విష్ణుసేవానందగిరిస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీధర్మశాస్తా సేవాసమితి అధ్యక్షుడు గుండ రాధాకిషన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. చల్లూరి విష్ణుమూర్తిశర్మ, రంజిత్‌ల వైదిక నిర్వహణలో 120 మంది ముత్తైదువలచే ఉదయం నుంచి సామూహిక స్ఫటిక శ్రీచక్ర అభిషేకం, నవావరణ సహిత లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి.

ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్, మార్చి 10: అఖిల భారత బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక గాయత్రినగర్‌లో గల నగరంలోని వజ్ర ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్, ఈఎన్‌టీ, చెస్ట్ ఫిజీషియన్, డెంటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్‌రావు, ప్రధాన కార్యదర్శి పురం ఉపేందర్‌శర్మ, డాక్టర్ గర్రెపల్లి మహేశ్‌శర్మ, కస్బ భూమేశ్వరరావు, రామక విఠల్ శర్మ, మంగళంపల్లి వెంకన్న, మూగ నాగన్నశర్మ, ఎర్రబాటి శశికాంత్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్ వైశ్య సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

కరీంనగర్ టౌన్, మార్చి 10: నగరంలోని గణేశ్‌నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడిగా కొలిపాక శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం గణేశ్‌నగర్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికకు ముగ్గురు అభ్యర్థులు కొలిపాక శ్రీనివాస్, భూపతి చిరంజీవి, కొండూరి ప్రభాకర్ పోటీ చేయగా కొలిపాక శ్రీనివాస్ 141 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు బండ సత్తయ్య, ఉప్పల రామేశ్, కొమురవెల్లి ప్రభాకర్, ఎలగందుల వెంకటరమణ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా జగదీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ కొలిపాక అంజయ్య, వైశ్య సంఘం నగర అధ్యక్షుడు నగునూరి రాజేందర్ హాజరై నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను అభినందించి ప్రమాణస్వీకారం చేయించారు.

వరల్డ్ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ ప్రదీప్

సుభాష్‌నగర్, మార్చి 10: వరల్డ్ సర్జన్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన వరల్డ్‌కాన్ కాన్ఫరెన్స్-2024లో డాక్టర్ ప్రదీప్ పాల్గొని ప్రసంగించారు.

బిర్లా స్కూల్‌లో బాస్కెట్‌బాల్ పోటీలు

కరీంనగర్‌రూరల్, మార్చి 10: నగరంలోని బిర్లా ఓపెన్‌మైండ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. పాఠశాలలో హౌస్‌లవారీగా గ్రేడ్ 6 నుంచి గ్రేడ్10 వరకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమిక్ ఆడిటర్ హరిప్రసాద్, పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, బాస్కెట్ బాల్ కోచ్ అనిల్ జయరాం, అసోసియేషన్ సెక్రెటరీ అనంతరెడ్డి, జి శ్రీధర్‌రావు, సునీల్‌కుమార్, వెంకటేష్, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుంటాం

-పద్మనాయక వెలమ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు -ప్రజాప్రతినిధులకు సన్మానం



వెలమసంఘం సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కరీంనగర్ అర్బన్, మార్చి 10: సామాజిక సేవా కార్యక్రమాల్లో పద్మ నాయక వెలమ సంఘం ముందుం టుందని సంఘం జిల్లా అధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాల్‌రావు అన్నారు. పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ పద్మ నాయక కల్యాణ మండపంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సభాధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాలరావు మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకునేందుకు వసతిగృహాలు నిర్వహిస్తున్నామని, స్కాలర్‌షిప్‌లను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎం.సంజయ్ కుమార్, విజయరమణారావు, కె.సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్, మేయర్ సునీల్‌రావును సంఘం నాయకులు సన్మానించారు. సంఘం చేపట్టిన పనులతో పాటు చేపట్టబోయే పనుల గురించి సంఘం ప్రధాన కార్యదర్శి చీటి ప్రకాష్‌రావు నివేదికను చదివి వినిపించారు. ఇరుకుల్లలో ఏసీ ఫంక్షన్‌హాల్ నిర్మాణంతో పాటు మెయిన్ హాల్ రెనవేషన్‌కు ప్రతిపా దనలు ప్రవేశపెట్టారు. నూతనంగా ఏసీ ఫంక్షన్‌హాల్ నిర్మాణం కోసం 60 లక్షలు విరాళంగా ప్రకటించిన దాత యాచమనేని కిరణ్‌రావును బి.వెంకటేశ్వరరావు, చిట్టినేని వెంకటేశ్వరరావులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు గంద్ర సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శి చీటి ప్రకాష్‌రావు, కోశాధికారి భీమ్‌రావు, సంయుక్త కార్యదర్శి బోయినపల్లి భూపతిరావు, కార్యవర్గ సభ్యులు అనిల్‌రావు, సంపత్‌రావు, మాధవరావు, రఘురామ్‌రావు, రాజగోపాల్‌రావు, వేణుగోపాలరావు, సుధాకర్‌రావు, అశోక్‌రావు, గీత, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులు కళలపై ఆసక్తి పెంచుకోవాలి



అల్ఫోర్స్‌లో జ్యోతి ప్రజ్వళన చేస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం

కరీంనగర్ టౌన్, మార్చి 10: విద్యార్థులు కళలపై ఆసక్తి పెంచుకోవాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వావిలాలపల్లి జెన్‌నెక్స్ మైదానంలో మౌక్తికం పేరుతో నిర్వహించిన అల్ఫోర్స్ టైనీటాట్స్ హైస్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కళల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈసంద ర్భంగా నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



మానకొండూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మానకొండూర్, మార్చి 10: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు 21 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు కాంగ్రెస్ మండల ఆధ్వర్యంలో ఆదివారం మానకొండూర్‌లో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం 21 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించడం శుభపరిణామమని కొనియాడారు. కార్యక్రమంలో నందగిరి రవీంద్రాచారి, రామిడి తిరుపతి, రామిడి తిరుమల్‌రెడ్డి, సాయిరి దేవయ్య, మడుపు ప్రేమ్‌కుమార్, నందగిరి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో కాంగ్రెస్ పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు 21శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గోపు మల్లారెడ్డి, కల్వ మల్లేశం, రమేశ్, సంగం శ్రీనివాస్ రెడ్డి, మామిడి నరేంద ర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఘనస్వాగతం

తిమ్మాపూర్, మార్చి 10: ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు స్వీకరించి మొదటి సారిగా కరీంనగర్ వచ్చేసిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు ఆదివారం ఘన స్వాగతం పలికారు. మండలంలోని మహాత్మానగర్ వద్ద ఆదివారం రాజీవ్ రహదారిపై ఎన్ఎస్‌యూఐ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి అలుగునూర్ మీదుగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వెంట బైక్ ర్యాలీతో కరీంనగర్ వరకు తరలివెళ్లారు.

నిధుల మంజూరు అభినందనీయం

గన్నేరువరం, మార్చి 10, మండలంలోని గుండ్లపల్లి స్టేజీ నుంచి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం 70కోట్ల నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభించేందుకు జీవోను జారీ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేశారని తెలిపారు. గన్నేరువరం మండల అభివృద్ధి కవ్వంపల్లి సత్యనారాయణ తోనే సాధ్యమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానించిన నాయకులు

జమ్మికుంట, మార్చి 10: జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తడక శ్రీకాంత్, నేరేళ్ళ మహేందర్‌గౌడ్, బొంగొని వీరన్న, దేశిని సదానందం, శ్రీపతి నరేష్, పైడిపల్లి ఆనందం, రాంమూర్తి, బుర్ర సంపత్, అయోధ్యగౌడ్, సదానందం రమేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు

రామడుగు, మార్చి 10: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ పాఠశాలలో 1998-99లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత కలుసుకొని సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. తమకు అప్పుడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

వాహనదారులు పత్రాలు వెంట ఉంచుకోవాలి

హుజూరాబాద్, మార్చి 10: వాహనదారులు సంబంధింత ధ్రువపత్రాలు వెంట ఉంచుకో వాలని హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేశ్ సూచించారు. సీపీ, ఏసీపీల ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి సీఐ రమేశ్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే సహించేది లేదన్నారు. ఈ మేరకు నంబర్ ప్లేట్లు లేని 10 వాహనాలకు జరిమానా విధించామన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ లేని మూడు ద్విచక్ర వాహనాలు, ఒక కారును సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 10: మానకొండూర్‌లోని స్థానిక రైసుమిల్లుల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ నుంచి కరీంనగర్‌కు బైక్(టీఎస్02 ఈడీ 4530)పై వెళుతుండగా స్థానిక రైసుమిల్లుల ప్రాంతంలో అదుపుతప్పి పడిపోయాడు. కింద పడిన అతడికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. స్కూటీలోని వాహన కాగితాలలో జమ్మికుంట అని ఉందని, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు

కరీంనగర్ క్రైం, మార్చి 10: పోలీసుల మనోభావాలు కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వచ్చిన ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేశామని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈ నెల 7న కరీంనగర్‌లోని ప్రతిమ మల్టిప్లెక్స్‌లో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన తరువాత కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు మిత్తితో సహా చెల్లిస్తామని ఉద్దేశపూర్వకంగా బెదిరించారని కరీంనగర్‌కు చెందిన ఎన్‌జీవో కార్యకర్త పురుషోత్తమ ఆశిష్‌గౌడ్ ఫిర్యాదు చేశారున్నారు. ఈ మేకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ ఎండీ పూజలు

కరీంనగర్ రూరల్, మార్చి 10: కొత్తపల్లి మండలంలోని ఎలగందల్‌లోని అతి పురాతనమైన మహమ్మాయి దేవాలయంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్‌చారి, ఉపాధ్యక్షుడు హరిహరచారి, ఆలయ ప్రధాన అర్చకులు తిరుపతాచార్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, మార్చి 10: ముకరంపుర పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏడీఈ ఎం.సుదీర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి పొన్నంకు ఆర్టీసీ అధికారుల సన్మానం

భగత్‌నగర్, మార్చి 10: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్టీసీ అధికారులు సన్మానించారు. ఆదివారం కరీంనగర్‌లో ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన మంత్రిని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్లు మల్లయ్య, మల్లేశం, మల్హర్‌రావు, రజనీకృష్ణ, చంద్రయ్య సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘కదనభేరి’ని విజయవంతం చేయాలి

కరీంనగర్ రూరల్, మార్చి 10: కరీంనగర్‌లో 12న నిర్వహించే కదనభేరి సభను జయప్రదం చేయాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్, వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్, గుర్రాల జయప్రకాశ్‌రెడ్డి, వల్లాల రాజు, అనిల్‌గౌడ్, సతీష్, నజీమాబేగం పాల్గొన్నారు.

కదనభేరికి కదలి రావాలని డప్పు చాటింపు

గణేష్‌నగర్, మార్చి 10: కరీంనగర్‌లో ఈనెల 12న నిర్వహించే కదనభేరి సభకు కదలిరావాలని ఆదివారం తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్‌వీ, బిఆర్ఎస్‌వై నాయకులు డప్పు చాటింపు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మాట్లాడుతూ కేసీఆర్ హాజరయ్యే కదనభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌గౌడ్, జక్కుల నాగరాజుయాదవ్, తిరుపతి నాయక్, శ్రీనాథ్‌గౌడ్, ద్యావ మధుసూదన్‌రెడ్డి, కేంసారం తిరుపతి, దూలం సంపత్‌గౌడ్, వెంకట్, హరీష్, పర్శరాం, రవినాయక్, రాజునాయక్, సత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

కరీంనగర్ టౌన్, మార్చి10: స్థానిక హౌజింగ్‌బోర్డు కాలనీలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భగత్‌నగర్ రావూస్ పాఠశాల విద్యార్థులు పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో నితిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్ పాల్గొన్నారు.

యువజన సమస్యల పరిష్కారానికి పోరాటం

గణేష్‌నగర్, మార్చి10: యువజన సమస్యల పరిష్కారానికి డీవైఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ అన్నారు. ఆదివారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలం గాణ చౌక్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేష్‌పటేల్, తిరుపతి నాయక్, నాయకులు విజయ్ శ్రావణ్, అజయ్, శ్రీనివాస్, తరుణ్, సురేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

తిమ్మాపూర్, మార్చి10: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గుజ్జెటి రాము కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దాతల ద్వారా సేకరించిన డబ్బులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, నాయకులు కొత్త రాజిరెడ్డి, బుదారపు శ్రీనివాస్, వంగాల కిషన్ రెడ్డి, తాజోద్దీన్, సిరిగిరి కొండల్ రావు, పొన్నల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. మన్నెంపల్లి గ్రామానికి చెందిన ఇజ్జిగిరి అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి మర్కొండ ఎల్లయ్య పటేల్, ఏఎస్సై మర్కొండ కిషన్ పటేల్-లక్ష్మి దంపతులు క్వింటాల్ బియ్యం, 10వేల రూపాయలు, గ్రామ మాజీ ఉప సర్పంచ్ పొన్నం అనిల్ 5వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, ఉప సర్పంచ్ అనిల్ గౌడ్ , ఎంపీటీసీ కనకయ్య పాల్గొన్నారు.

పురుషుల పొదుపు సంఘం భవనం తాళం పగులగొట్టిన దుండగులు

శంకరపట్నం, మార్చి 10: తాడికల్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర పురుషుల పొదుపు సంఘం భవనం తాళాలు పగులగొట్టి అందులోని వస్తువులను ధ్వంసం చేశారని పొదుపు సంఘం అధ్యక్షుడు నరహరి రాజిరెడ్డి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. అలాగే తాడికల్ జాతీయ రహదారి పక్కనే ఉన్న బత్తిని వేణు ఇంటి ముందు పెట్టిన ద్విచక్ర వాహనం చోరీ కావడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌కు బెంచీలు విరాళం

గంగాధర, మార్చి 10: పోలీస్‌స్టేషన్‌కు బలిమెల ఎన్‌కౌంటర్‌లో అశువులు బాసిన జవాన్ గుజ్జెటి మహేష్ జ్ఞాపకార్థం నాలుగు బెంచీలను ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా ఎస్సై కిరణ్‌రెడ్డి, యూత్ సభ్యులు మహేష్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ యువత దేశ సేవ చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల మానవహారం

మానకొండూర్, మార్చి 10 : మండలంలోని అన్నారం, రంగపేట గ్రామాల్లో కరీంనగర్‌లోని వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం మానవహారం చేపట్టారు. ఆయా గ్రామాల్లోని పురవీధుల్లో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ప్రిన్సిపాల్ సతీష్‌గౌడ్, రమణ, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

జమ్మికుంట, మార్చి 10: పట్టణంలోని గీతా మందిర్ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మురికి పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమలత, జయశ్రీ, స్వరూప, వాణి, అరుణాదేవి, మాధవి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.